ఆగయ్య ఆస్తులపై విచారణ జరపాలి


మాట్లాడుతున్న నర్సయ్య

ఎల్లారెడ్డిపేట: బీఆర్‌ఎస్ హయాంలో కబ్జాకు గురైన భూములను కాంగ్రెస్ ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఇందులో భాగంగానే ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య కబ్జా చేసిన ఎకరం భూమిని శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆయన ఆస్తులపై సీబీసీఐడీ విచారణ జరిపించాలని అధికారులను కోరారు. ఎల్లారెడ్డిపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సింగారం గ్రామ శివారులో 199 సర్వే నంబర్‌లోని 8 ఎకరాల భూమిని ఆగయ్య కొనుగోలు చేసి, దాని పక్కనే ఉన్న ఎకరం భూమిని ఆక్రమించుకున్నారని ఆరోపించారు. గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా రెవెన్యూ అధికారులు గురువారం విచారణ చేపట్టి, స్వాధీనం చేసుకున్నారని పేర్కొన్నారు. నాయకులు గుండాడి రాంరెడ్డి, వంగ గిరిధర్‌రెడ్డి, బాబు, పందిర్ల శ్రీనివాస్, గంట అంజయ్య, ఎడ్ల రాజ్‌కుమార్, బుచ్చాగౌడ్, రఫిక్, పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

నేతన్నల బకాయిలపై స్పష్టత ఏదీ?


మాట్లాడుతున్న గూడూరి ప్రవీణ్

సిరిసిల్లటౌన్: రాష్ట్ర ప్రభుత్వం నేతన్నల బకాయిలపై స్పష్టత ఇవ్వాలని టీఎస్‌పీటీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్ డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అధ్యక్షతన శుక్రవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ఆర్డర్లు, ప్రభుత్వ సాయం, గతంలో రావాల్సిన బకాయిలు, ఆసాములు, కార్మికుల సంక్షేమానికి కృషి చేసేందుకు జేఏసీ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కానీ, కమిటీ ప్రతినిధులు కొందరు స్వలాభం కోసం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై నిందలు వేయడం సరికాదన్నారు. యారన్ డిపో సిరిసిల్లలోనే ఏర్పాటు చేయాలని బీఆర్‌ఎస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి కోరారు. గత ప్రభుత్వ ఆర్డర్ల విషయంలో తనపై జేఏసీలోని కొందరు నేతలు ఆరోపణలు చేయడం తగదన్నారు. కాంగ్రెస్ నేతలే ఎక్కువగా ఆర్డర్లు పొందారని తెలిపారు. నాయకులు ఆకునూరి శంకరయ్య, కుంభాల మల్లారెడ్డి, వెంగళ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'మధ్యాహ్న' సరుకులు ప్రభుత్వమే ఇవ్వాలి


విద్యా కమిషన్ చైర్మన్ మురళికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఇల్లంతకుంట: మధ్యాహ్న భోజనానికి సంబంధించిన సరుకులను ప్రభుత్వమే ఇవ్వాలని మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మణ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళిని కలిసి, వినతిపత్రం అందించారు. మార్కెట్ ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు లేనందున కార్మికులు రెండు కూరలు వండలేరని తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా రూ.10 వేల వేతనం వెంటనే అమలు చేయాలని కోరారు. రాగి జావ కాచినందుకు ప్రతీ విద్యార్థికి రూ.2 చొప్పున కార్మికులకు చెల్లించాలన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చైర్మన్ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. నాయకులు లక్ష్మణ్, ప్రేమ పావని, కమలాకర్ రెడ్డి, చక్రపాణి తదితరులున్నారు.

క్లుప్తంగా

ఖతార్ పంపిస్తానని మోసం

• హైదరాబాద్ మహిళ అరెస్టు

వేములవాడరూరల్: వర్క్ వీసాపై ఖతార్ దేశానికి పంపిస్తాని డబ్బులు తీసుకొని, మోసం చేసిన హైదరాబాద్‌కు చెందిన ఓ మహిళను అరెస్టు చేసినట్లు వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. శాత్రాజుపల్లికి చెందిన పొన్నాల కనకయ్య, మొగిలి రామస్వామిలను వర్క్ వీసా మీద ఖతార్ పంపిస్తానని హైదరాబాద్‌లోని హుమాయూన్ నగర్‌కు చెందిన షేక్ షాజహాన్ బేగం అలియాస్ షేక్ ఫాతిమా నమ్మించింది. ఒక్కొక్కరి వద్ద రూ.1.15 లక్షలు తీసుకుంది. కానీ, తర్వాత వారిని పంపించలేదు. డబ్బులు కూడా తిరిగి వ్వడం లేదు. బాధితుల ఫిర్యాదు మేరకు ఆమెపై చీటింగ్ కేసు నమోదు చేశామని, శుక్రవారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. ఫాతిమా ద్వారా మోసపోయిన వారు ఇంకా ఎవరైనా ఉంటే వేములవాడ టౌన్ పోలీసులను సంప్రదించాలని సూచించారు.

మద్యం మత్తులో బైక్ నడిపి..

• బావిలో పడిన సిరిసిల్లవాసి

సిరిసిల్ల క్రైం: మద్యం మత్తులో బైక్ నడుపుతూ వెళ్లిన ఓ వ్యక్తి వ్యవసాయ బావిలో పడ్డాడు. స్థానికుల వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణం గణేశ్‌నగర్‌కు చెందిన జి.గణేశ్ మద్యం మత్తులో శుక్రవారం రాత్రి బైక్‌పై సిరిసిల్ల బైపాస్ గుండా వెళ్తున్నాడు. వాహనం అదుపుతప్పడంతో రోడ్డు పక్కనున్న వ్యవసాయ బావిలో పడ్డాడు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకొని, అతన్ని రక్షించారు. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

హోంగార్డుకు ఆర్థికసాయం


రమేశ్‌కు రూ.లక్ష అందిస్తున్న పోలీసులు

తంగళ్లపల్లి: అనారోగ్యంతో బాధ పడుతున్న హోంగార్డుకు పోలీసులు అండగా నిలిచారు. తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన హోంగార్డు రమేశ్‌కు ఇటీవల పక్షవాతం వచ్చి, మంచానికే పరిమితమయ్యాడు. అతని పరిస్థితి తెలసుకున్న పోలీసు అధికారులు, సిబ్బంది, తోటి హోంగార్డులు తమ వంతుగా రూ.లక్ష పోగుచేసి, శుక్రవారం అందజేశారు. తాము అండగా ఉంటామని, అధైర్యపడొద్దన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు మధుకర్, యాదగిరి, కానిస్టేబుల్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మహిళల హత్యపై నిరసన



ఎల్లారెడ్డిపేట: కర్ణాటక రాష్ట్రంలోని ఇంద్రనగర్‌లో 10 రోజుల క్రితం ఇద్దరు మహిళలపై అత్యాచారం, హత్య ఘటనలపై బేడ బుడగ జంగాల నాయకులు రాచర్లగొల్లపల్లి బస్టాండ్ వద్ద శుక్రవారం రాత్రి నిరసన తెలిపారు. అంబేడ్కర్ విగ్రహం వరకు కొవ్వొత్తులతో ర్యాలీ తీశారు. బేడ బుడగ జంగాల సంఘం రాష్ట్ర కోశాధికారి డొక్క రాజేశ్ మాట్లాడుతూ.. ఇద్దరు మహిళలపై దుండగుల దాడి, అత్యాచారం, హత్య అమానుషమన్నారు. నేరస్తులను ఉరి తీయాలని, డిమాండ్ చేశారు. నాయకులు హన్మంతు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లు సీజ్?

తంగళ్లపల్లి: పద్మనగర్‌లోని ఓ రైస్‌మిల్లును పౌరసరఫరాల శాఖ అధికారులు 2 రోజుల క్రితం సీజ్ చేసినట్లు తెలిసింది. మిల్లులో పీడీఎస్ బియ్యం ఉన్నట్లు సమాచారం రావడంతో జిల్లా అధికారులు ఆకస్మిక తనిఖీలు చేసి, చర్యలు తీసుకున్నట్లు సమాచారం. అయితే, ఈ విషయమై వారు ఎటువంటి ప్రకటన చేయలేదు.

వరి పంట పరిశీలన

వీర్నపల్లి: మండల కేంద్రంలో వరి పంటను ఏవో జయ శుక్రవారం పరిశీలించారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా అగ్గి తెగులు వచ్చే అవకాశం ఉందన్నారు. నివారణకు ట్రిసైక్లోజోల్ 0.5 గ్రాములు లేదా ఇసాప్రోథియోలిన్ 5 మి.లీ. లేదా కసుగమైసైన్ 2.5 మి.లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

ఇల్లంతకుంట: రహీంఖాన్‌పేట ఆదర్శ పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థులు నలుగురు రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ గంగాధర్ శుక్రవారం తెలిపారు. వైష్ణవి, శ్రీనిజ, నిత్య, రామ్‌చరణ్‌లను ఆయన అభినందించారు.

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలి

• చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యం

బోయినపల్లి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కోరారు. శుక్రవారం బోయినపల్లి మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో ఉన్న పటభద్రులను గుర్తించి, వారి ఓట్లు నరేందర్‌రెడ్డికి పడేలా చూడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ముదుగంటి సురేందర్‌రెడ్డి, కూస రవీందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేశ్ యాదవ్, నిమ్మ వినోద్‌రెడ్డి, వరాల నర్సింగం తదితరులు ఉన్నారు.

యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

వేములవాడరూరల్: నూకలమర్రి గ్రామంలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి మద్దతుగా ప్రచారం చేశారు. గ్రాడ్యుయేట్లను కలిసి, కాంగ్రెస్ పథకాలను, ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్, ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లను వివరించారు. యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రోమాల ప్రవీణ్‌కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సామల్ల రాజు, చిట్టినేని హరిచరణ్, మేడుదుల శ్రీను, మల్యాల గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

కందికట్కూరులో..

ఇల్లంతకుంట: కందికట్కూర్ గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి గెలుపు కోసం ఆ పార్టీ నాయకులు శుక్రవారం ప్రచారం నిర్వహించారు. పార్టీ గ్రామ శాఖ కాంగ్రెస్ అధ్యక్షుడు బిగుళ్ల విజయ్, మాజీ సర్పంచ్ ముత్యం అమర్‌గౌడ్, ఎంపీటీసీ మాజీ సభ్యులు దొమ్మాటి కిశోర్‌గౌడ్, యాస తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేటలో ప్రచారం

ముస్తాబాద్: గంభీరావుపేటలో దళిత సంఘాల నాయకులు శుక్రవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి, గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సదానందం, రవీందర్, సత్యం, సుధీర్, నారాయణ, ఇబదుల్లాఖాన్, దేవరాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

భవన కార్మికుల సమస్యలు పరిష్కరించండి

• సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి


మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

వేములవాడ అర్బన్: భవన నిర్మాణ కార్మికులకు వేలిముద్ర పద్ధతి రద్దు చేసి, నూతన లేబర్ కార్డులు అందించి, వారి సమస్యలు పరిష్కరించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. వేములవాడ పట్టణంలో శుక్రవారం నిర్వహించిన భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా 3వ మహాసభకు ఆయన హాజరై, మాట్లాడారు. కార్మికులు సహజంగా మరణిస్తే రూ.5 లక్షలు, యాక్సిడెంట్‌లో చనిపోతే రూ.10 లక్షలు, అంత్యక్రియలకు రూ.20 వేలు ఇవ్వాలన్నారు. 55 ఏళ్లు నిండినవారికి రూ.5 వేల పెన్షన్, అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని కోరారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు, ప్రవీణ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు గాజుల పోశెట్టి, ప్రధానకార్యదర్శి కడారి రాములు, నాయకులు పాల్గొన్నారు.

'రైతులను అరిగోస పెడుతున్నరు'


మాట్లాడుతున్న సుభాష్

ఎల్లారెడ్డిపేట/తంగళ్లపల్లి: డెయిరీని సీజ్ చేసి, రైతులను అరిగోస పెడుతున్నారని బీఆర్‌ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు అందె సుభాష్ అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డిపేటలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అన్నదాతలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. నాయకులు ఎడ్ల సందీప్, మీసం రాజం, బాధ రమేశ్, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఎమర్జెన్సీ రోజులు..

జిల్లాలో ఎమర్జెన్సీ రోజులు వచ్చినట్లు ఉందని సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు మాట్ల మధు విమర్శించారు. తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్ వద్ద శుక్రవారం ఆయన మాట్లాడారు. ప్రశ్నిస్తే కేసులు, అక్రమ అరెస్టులతో కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారని మండిపడ్డారు. అనారోగ్యంతో బాధపడుతున్న జిల్లెల్లకు చెందిన రైతు అబ్బాడి రాజిరెడ్డిని అక్రమంగా అరెస్టు చేయడం హేయమైన చర్య అన్నారు. నాయకులు రాజన్న, దేవదాస్, భాస్కర్‌గౌడ్, నవీన్ రావు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రామన్నపల్లిలో పోలీసుల పహారా

• కొలిక్కిరాని వివాదం


గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు

కోనరావుపేట: మండలంలోని రామన్నపల్లి(బావుసాయిపేట)లో బాధిత కుటుంబీకుల ఆందోళన రెండో రోజూ కొనసాగింది. గ్రామానికి చెందిన బత్తుల రేణ గురువారం ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. రేణ, ఆమె భర్త మల్ల య్య మృతికి అదే గ్రామానికి చెందిన ఒకరు కారణమని ఆరోపిస్తూ మహిళ బంధువులు ఆందోళన చేస్తున్నారు. రేణ మృతదేహం రెండు రోజులుగా మార్చురీలోనే ఉంది. ఇరువర్గాల మధ్య చర్చలు కొలిక్కిరాలేదు. మహిళ బంధువులు గొడవకు దిగుతారేమోనని ముందస్తుగా పోలీసులు రెండు రోజు లుగా గ్రామంలో పహారా కాస్తున్నారు. చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, కోనరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డి బందోబస్తు పర్యవేక్షించారు.

ఎములాడ దారి.. చెత్త చేరి



బోయినపల్లి: రత్నంపేట నుంచి రామన్నపేట మీదుగా వేములవాడకు వెళ్లే దారికి ఇరువైపులా చెత్తాచెదారం పేరుకుపోతోంది. గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని సీపీఎం బోయినపల్లి మండల కార్యదర్శి గురజాల శ్రీధర్ ఆరోపించారు. ఇప్పటికైనా తొలగించాలని కోరారు.

ఇసుక సామాన్యులకు అందుబాటులో ఉంచాలి

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో గృహ నిర్మాణాలకు ఇసుక అందుబాటులో లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేటలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ అధికారులు లేనిపోని ఆంక్షలు విధిస్తూ ఇసుకను అందని ద్రాక్షలా మార్చారని ఆరోపించారు. ప్రభుత్వం ఆలోచించి, ఎప్పటిలాగే ఎక్కడి ఇసుక రీచ్‌లను అక్కడే ఉంచి, ఇసుకను సామాన్యులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

మా గ్రామానికి 'అన్నపూర్ణ' నీరివ్వండి

• ఎంపీడీవోను కోరిన ఆరెపల్లి రైతులు



ఇల్లంతకుంట: పంటలు ఎండిపోతున్నాయి.. మా గ్రామానికి అనంతగిరి అన్నపూర్ణ ప్రాజెక్టు నీరివ్వాలని ఇల్లంతకుంట మండలంలోని ఆరెపల్లి రైతులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీడీవో శశికళకు వినతిపత్రం అందించారు. డి–5 కెనాల్ ద్వారా నీరివ్వాలని అడగగా.. అది తమ పరిధిలో లేదని ఆమె తెలిపారు. సమస్యను కాంగ్రెస్ నాయకుడు ఐరెడ్డి మహేందర్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా.. ప్రాజెక్టు అధికారితో మాట్లాడారని, ఆయన పరిశీలిస్తామని చెప్పారని రైతులు పేర్కొన్నారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం


మహిళా రైతులను సన్మానిస్తున్న గోపాలమిత్ర టీమ్

వీర్నపల్లి: పశు గణాభివృద్ధి సంస్థ కరీంనగర్ ఆధ్వర్యంలో శుక్రవారం భూక్య తండాలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు గర్భకోశ వ్యాధి, ఎద పరీక్షలు చేశారు. దూడలకు నట్టల నివారణ మందు వేశారు. వ్యవసాయంతోపాటు పాడి పరిశ్రమ రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంటుందన్నారు. అనంతరం ఉత్తమ మహిళా రైతులను సన్మానించారు. గోపాలమిత్ర సూపర్‌వైజర్ రాములు, గోపాలమిత్రలు ప్రవీణ్ నాయక్, భూపతి తదితరులు పాల్గొన్నారు.

సొడాలమ్మ సేవలో ఎమ్మెల్యే 'కవ్వంపల్లి'


మొక్కు చెల్లించుకున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

ఇల్లంతకుంట: సోమారంపేట సొడాలమ్మ జాతరకు శుక్రవారం మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హాజరయ్యారు. అమ్మవారికి మొక్కు చెల్లించుకున్నారు. స్థానిక శ్రీకృష్ణ యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి జాతర ఉత్సవాలు జరుగుతున్నాయి. మాజీ ఎంపీపీ వెంకటరమణారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ సురేందర్ రెడ్డి, నాయకులు పసుల వెంకటి, అనంతగిరి వినయ్‌కుమార్, ఖాతా మల్లేశం, రాజిరెడ్డి తదితరులున్నారు.

మాజీ ఎమ్మెల్యే రసమయి పూజలు

సోమారంపేట సొడాలమ్మకు మానకొండూర్ బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే బాలకిషన్ శుక్రవారం మొక్కు చెల్లించుకున్నారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, బీఆర్‌ఎస్ నాయకులు రాజిరెడ్డి, బాలకిషన్, అంజయ్య, రాములు తదితరులున్నారు.

రేపాక పెద్ద చెరువు నింపండి

ఇల్లంతకుంట మండలంలోని రేపాక పెద్ద చెరువును అనంతగిరి అన్నపూర్ణ ప్రాజెక్టు డి–6 కెనాల్ ద్వారా నింపాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు శుక్రవారం రేపాకకు వచ్చిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. ఈ చెరువు కింద 250 ఎకరాల ఆయకట్టు ఉందన్నారు. స్పందించిన ఆయన ప్రాజెక్టు డీఈ దేవేందర్ రెడ్డితో మాట్లాడి, సమస్య వివరించారు. త్వరలోనే పరిష్కరిస్తామని డీఈ తెలిపారు. మాజీ ఎంపీపీ వెంకటరమణారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు సుమలత, నాయకులు మల్లేశం, బాబు పాల్గొన్నారు.

మాతృభాషను భావితరాలకు అందిద్దాం


తంగళ్లపల్లి కళాశాలలో కవి జగన్నాథంను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, లెక్చరర్లు

ముస్తాబాద్: కనుమరుగవుతున్న మాతృభాషను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి అన్నారు. కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. బంగ్లాదేశ్‌లో మాతృభాష కోసం విద్యార్థులు చేసిన ప్రాణత్యాగానికి గుర్తుగా వేడుకలు జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఏ వ్యక్తి అయినా మాతృభాష ద్వారానే అభివృద్ధి చెందుతాడన్నారు. కానీ, చాలామంది పరభాష వ్యామోహంలో పడి, వెనుకబాటుకు గురవుతున్నారని పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకర్, అధ్యాపకులు ఆంజనేయులు, ధర్మపురి, వాణి, శ్రవణ్, భిక్షమయ్య, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన బాలకవి సమ్మేళనం

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా శుక్రవారం గంభీరావుపేట హైస్కూల్లో బాలకవి సమ్మేళనం నిర్వహించారు. తెలు గు భాష గొప్పదనాన్ని వివరిస్తూ విద్యార్థులు పద్యాలు, కవితలు రాసి, చదివి వినిపించారు. అనంతరం తెలుగు భాష పండితులను సన్మానించారు.

గిరిజన మహిళా డిగ్రీ కళాశాలలో..

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ప్రముఖ కవి, రచయిత, దాశరథి కృష్ణమాచార్య పురస్కార గ్రహీత జూకంటి జగన్నాథంను సన్మానించారు. ప్రిన్సిపాల్ జయ, వైస్ ప్రిన్సిపాల్ రెహానా ఇఫ్షత్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓబులాపూర్ పాఠశాలలో..

తంగళ్లపల్లి మండలంలోని ఓబులాపూర్ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం బండి ఉపేందర్ మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థి మాతృభాషపై అభిరుచి పెంచుకొని, మానవ సంబంధాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. చిత్రలేఖన పోటీల్లో రాణించిన, జానపద గేయాలు ఆలపించిన విద్యార్థులను అభినందించారు. తెలుగు టీచర్ ఎలిగేటి శ్రీనివాస్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వస్త్ర పరిశ్రమను కాపాడుకోవాలి

• జేఏసీని రాజకీయాల కోసం వాడుకోవద్దు
• పవర్‌లూమ్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూశం రమేశ్



మాట్లాడుతున్న రమేశ్

సిరిసిల్లటౌన్: వస్త్ర పరిశ్రమ సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన అనుబంధ సంఘాల జేఏసీని వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవద్దని పవర్‌లూమ్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూశం రమేశ్ అన్నారు. శుక్రవారం సిరిసిల్ల బి.వై.నగర్‌లోని కామ్రేడ్ అమృత్‌లాల్ శుక్లా కార్మిక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిరిసిల్ల పవర్‌లూమ్ వస్త్ర పరిశ్రమలో సమస్యల పరిష్కారం కోసం వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాలతో ఏర్పాటు చేసిన జేఏసీని కొందరు రాజకీయంగా వినియోగించుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఆ విధానాన్ని మార్చుకోవాలని సూచించారు. ప్రతిపక్ష పార్టీలు, నాయకులు పరిశ్రమ అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి సలహాలు, సూచనలు ఇవ్వాలని, అధికార పార్టీ, ప్రజాప్రతినిధులు తోడ్పాటునందించాలని కోరారు. చేనేత, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కమిషనర్ శైలజ రామయ్యర్‌లకు వినతిపత్రాలు అందించినట్లు తెలిపారు. సీఐటీయూ నాయకులు కోడం రమణ, అన్నల్‌దాస్ గణేశ్, సిరిమల్ల సత్యం, ఒగ్గు గణేశ్, జిందం కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఠాణాకు చేరిన అక్రమ నిర్మాణ పంచాయితీ


చందుర్తిలో విచారణ జరుపుతున్న పోలీసులు

చందుర్తి: చందుర్తి గ్రామ పంచాయతీ పరిధి 2వ వార్డులో అక్రమ నిర్మాణ పంచాయితీ ఠాణాకు చేరింది. రేకుల షెడ్డును అక్రమంగా బోర్ వరకు నిర్మించారని, నడిచేందుకు దారి లేకుండా చేశారంటూ స్థానికుడు కోన శ్రీనివాస్ ఈ నెల 17న కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. దీంతో గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో ప్రదీప్‌కుమార్ విచారణ చేపట్టారు. నిర్మాణం చేపట్టిన మహిళ తనను ఇదే వార్డు చెందిన ఏడుగురు దూషించారని అదేరోజు సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు శుక్రవారం 2వ వార్డుకు చేరుకొని, విచారణ చేపట్టారు. శనివారం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి, సమస్య పరిష్కరించుకోవాలని సూచించారు. అయితే, రేకుల షెడ్డు అక్రమ నిర్మాణమని అధికారులు చర్యలు తీసుకుంటే.. గత ఏడాదిలో గ్రామంలో చాలా నిర్మాణాలు నిబంధనలు విరుద్ధంగా జరిగాయి. వాటన్నింటిపైనా చర్యలుంటాయా అని స్థానికంగా చర్చ జరుగుతోంది.

సంక్షిప్త వార్తలు

● గంజాయికి దూరంగా ఉండాలి

ఎల్లారెడ్డిపేట: గంజాయికి దూరంగా ఉండాలని ఎస్సై రమాకాంత్, హెడ్ కానిస్టేబుల్ పాషా అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సాయిబాబా కమాన్, కొత్త బస్టాండ్ వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన పోలీస్ కమ్యూనిటీ మీటింగ్‌లో వారు మాట్లాడారు. గంజాయి వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గంజాయి విక్రయిస్తున్నట్లు, రవాణా చేస్తున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. రాత్రి 9 గంటల తర్వాత యువత బయట తిరగొద్దని, గుర్తు తెలియని వ్యక్తులు గ్రామాల్లోకి వస్తే తమకు చెప్పాలని సూచించారు.

● విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

కోనరావుపేట: మండలంలోని పల్లిమక్తలో నూతనంగా నిర్మించిన శ్రీ దుర్గాంబిక ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామ దేవతలకు పూజలు, కలశయాత్ర, శోభాయాత్ర తదితర కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు హాజరయ్యారు.

● విద్యార్థులకు అభినందన

కోనరావుపేట: ఉస్మానియా యూనివర్సిటీలో ఈ నెల 18, 19వ తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్న నిజామాబాద్ ఉన్నత పాఠశాల విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు షాబొద్దీన్, పీడీ అజయ్‌కుమార్, టీచర్లు శుక్రవారం అభినందించారు. లాంగ్‌జంప్ అండర్–16 విభాగంలో రిషిత్, ట్రయథ్లాన్(స్విమ్మింగ్, సైక్లింగ్, రన్నింగ్) అండర్–14 విభాగంలో విక్కీ, హర్ష పాల్గొన్నారని తెలిపారు.

● ఉచిత కంటి వైద్యశిబిరం

ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రంలో రేకుర్తి కంటి వైద్యశాల ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఆపరేషన్ అవసరమైన 30 మందిని రేకుర్తి కంటి ఆసుపత్రికి తరలించామని నిర్వాహకుడు భాషు తెలిపారు. అలాగే పోతుగల్‌లో ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షలను నిర్వహించారు. అవసరమైన వారికి కంటి అద్దాలను అందజేస్తున్నామని ఫీల్డ్ ఆఫీసర్ రాజశేఖర్ తెలిపారు. బీజేపీ నాయకులు కోల కృష్ణ, వరి వెంకటేశ్, సిబ్బంది నాగరాజు, శివాని, భవాని తదితరులు పాల్గొన్నారు.

● మడేలేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

ముస్తాబాద్: మండల కేంద్రంలో శ్రీమడేలేశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం గణపతిహోమం, స్వామి వారికి అభిషేకం చేశారు. అనంతరం శ్రీమడేలేశ్వరస్వామి కల్యాణం కనులపండువగా జరిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రజక సంఘం నాయకులు శేరయ్య, దీటి నర్సింలు, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

చందాలతో అంత్యక్రియలు

తంగళ్లపల్లి: మండలంలోని ఇందిరమ్మకాలనీకి చెందిన అంకం నర్సవ్వ అనే నిరుపేద వృద్ధురాలు శుక్రవారం మృతిచెందింది. దీంతో గ్రామస్తులు చందాలు పోగుచేసి, ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన బండి చైతన్య గౌడ్ రూ.5 వేలు అందజేశారు.